పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్

- సొంత పనుల వినియోగానికి అడ్డుకట్ట
- నియోజకవర్గంలో 124 ట్రాక్టర్లు



చాగాపురంలో ఇతర పనులకు వెళ్లి బోల్తాపడ్డ పంచాయతీ ట్రాక్టర్

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను సర్పంచులు ఇకపై తమ సొంత పనులకు వాడుకోవడానికి చెక్ పడనుంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు ప్రభుత్వం జీపీఎస్ విధానంను అనుసంధానం చేసింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కసరత్తును చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో కూడా చెత్త సేకరణ, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోయడం కోసం ప్రతి జీపీకి ఒక ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌లను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసిన విషయం అందరికి తెలిసిందే. దీనిలో భాగంగా 500 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో 15 హెచ్‌పీ మినీ ట్రాక్టర్లు, 500 నుంచి 3 వేల లోపు జనాభా ఉన్న గ్రామాలకు 20, 21 హెచ్‌పీ ట్రాక్టర్లు, 3 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాలకు 39, 40, 42 హెచ్‌పీ సామర్థ్యం గల ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చింది. దీంతో చాలా జీపీలు ట్రాక్టర్లను కొనుగోలు చేసి జీపీల లోని వివిధ పనులకు వినియోగిస్తున్నారు. అయితే వాటిని గ్రామ పంచాయతీల అవసరాలతో పాటు పాలక వర్గాలు తమ స్వంత అవసరాలకు సైతం ఉపయోగిస్తున్నాయి. దీంతో నిత్యం ప్రతిపక్ష నాయకులు, ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దానికి అడ్డుకట్ట వేయడానికి జిల్లా ఉన్నతాధికారులు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) ను ట్రాక్టర్ ఇంజన్లకు అనుసంధానం చేస్తున్నారు.

జీపీఎస్ పనితీరు ఇలా..

జీపీఎస్‌ను ట్రాక్టర్‌కు అమర్చితే ట్రాక్టర్ స్టార్ట్ అయితే జీపీఎస్ పనిచేయడం మొదలవుతుంది. దీంతో గ్రామ పరిధిలోని రోజు వారీ విధుల్లో భాగంగా ఆ ట్రాక్టర్ ఎక్కడికి వెళ్తుంది. ఎక్కడ ఎంతసేపు ఉందనేది అందులో నిక్షిప్తం అవుతాయి. అదేవిధంగా ట్రాక్టర్ పంచాయతీ పరిధిలోనే ఉందా.. లేదా ఇతర అవసరాల కొరకు వేరే ప్రాంతాలకు వెళ్లిందా అనేది జీపీఎస్ సిస్టం ద్వారా తెలుసుకోవచ్చు. పాలక వర్గాలు తమ సొంత అవసరాలకు వాడకుండా అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు.

జీపీలపై ఆర్థిక భారం...

నియోజకవర్గంలో మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో చాలా జీపీలు ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులతో నిత్యం సతమతం అవుతున్నాయి. అయితే ప్రస్తుతం ట్రాక్టర్‌కు జీపీఎస్ అనుసంధానం చేస్తే రూ. 3,600 చెల్లించాల్సి వస్తుంది. అలాగే మెయింటెనెన్స్ ఖర్చుల కింద ప్రతి నెల కూడా అదనంగా రూ. 300 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆదాయ వనరులు లేని చిన్న చిన్న జీపీలకు దీని వల్ల మరింత ఆర్థికభారం పడనుంది.

నియోజకవర్గంలో 124 ట్రాక్టర్లు

అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 124 గ్రామ పంచాయతీలు కలవు. దీనిలో భాగంగా 124 పంచాయతీల్లో కూడా సర్పంచ్‌ల ద్వారా ప్రభుత్వం ట్రాక్టర్లను కొనుగోలు చేయించింది. ఇప్పటికే వీటన్నింటికి కూడా జీపీ పేరిట రిజిస్ట్రేషన్లు చేయడం కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం 74 ట్రాక్టర్లకు ఇప్పటికే జీపీఎస్‌ను అనుసంధానం చేశారు. మిగిలిన 50 ట్రాక్టర్లకు కూడా త్వరలోనే జీపీఎస్‌ను అనుసంధానం చేయిస్తామని అధికారులు తెలుపుతున్నారు.



కొండేరులో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీరందిస్తు..

ఆయా మండలాల వారీగా ట్రాక్టర్ల వివరాలు..

మండలం	జీపీలు	జీపీఎస్ ఉన్నవి	మొత్తం
ఇటిక్యాల	29	10	29
మానవపాడు	16	14	16
ఉండవెల్లి	16	10	16
అలంపూర్	14	07	14
వడ్డేపల్లి	10	10	10
రాజోలి	11	09	11
అయిజ	28	14	28

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం

పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వం ట్రాక్టర్‌ను కొనుగోలు చేయించింది. దీనిలో భాగంగా పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్‌ను అనుసంధానం చేయాలని ప్రత్యేక కార్యాచరణను కూడా రూపొందించింది. పాలక వర్గాలు పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించకుండా జీపీఎస్ అనుసంధానం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో మండలంలోని 29 ట్రాక్టర్లలో 10 ట్రాక్టర్‌లకు ఇప్పటికే జీపీఎస్ అనుసంధానం చేశాం. మిగిలిన ట్రాక్టర్‌లకు కూడా త్వరలోనే జీపీఎస్ ఏర్పాటు చేయిస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

క్లుప్తంగా

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

మల్దకల్: పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలను ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎప్పటికప్పుడు డ్రైయినేజీలను శుభ్రం చేయాలని, చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరందించి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



అయిజ: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న ఓపెన్ క్రికెట్ పోటీలను ఆయన తిలకించారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈనెల 14న విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మధుగౌడ్, మండల కార్యదర్శి హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం గురువారం ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడుకు చెందిన హుసేన్ (కిట్టు) పని నిమిత్తం బైక్‌పై ఎర్రవల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. అదేవిధంగా పెబ్బేర్ మండలంలోని పెంచికలపాడుకు చెందిన ఉశేన్, బీచుపల్లిలు బైక్‌పై బి. వీరాపురం నుంచి స్వగ్రామానికి వెళ్తూ దువాసిపల్లి సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉశేన్, బీచుపల్లిలు స్వల్ప గాయాలతో బయట పడగా, హుసేన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

పొగతో భక్తుల ఇక్కట్లు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామంలో ప్రతి మంగళవారం, శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు రేణుక ఎల్లమ్మ ఆలయానికి తరలివస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకుని భోజనాలు చేసే సమయంలో పక్కన ఉన్న డంపింగ్ యార్డు నుంచి పొగ వెలువడడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. సమయపాలనా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు చెత్తాచెదారాన్ని అంటిపెట్టడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కేసు నమోదు

ఉండవెల్లి: రాజోళికి చెందిన హనుమంతు బైక్‌పై గ్రామం నుంచి వివిధ పనుల నిమిత్తం ఉండవెల్లి మండలం తక్షశిలకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మండల కేంద్రంలోని శివారుకు రాగానే వెనక నుంచి కారు బైక్‌ను ఢీకొన్నది ఈ ఘటనలో హనుమంతుకు గాయాలయ్యారు. గురువారం బాధితుడి సతీమణి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

గరుడ స్తంభం, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనకు విరాళం



పెబ్బేరు: మండలంలోని బూడిదపాడులో గరుడ స్తంభం, బొడ్రాళ్ల పండుగ సందర్భంగా గురువారం పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ. 50 వేలు విరాళం అందించారు. గ్రామంలో బొడ్రాళ్ల పండుగకు పెద్ద మనస్సుతో ముందుకొచ్చి విరాళం ఇచ్చినందుకు గ్రామ ప్రజలు ఎంపీపీ మేఘారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హరిశంకర్‌రెడ్డి, అనుజ్ఞారెడ్డి, సురేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఓంప్రకాష్, శంకర్‌నాయుడు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

15న సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

కేటీదొడ్డి: ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు ఎంపీపీ మహ్మద్ అజార్ మోహిద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాతపాలెంలో 15న వాలీబాల్, ఖోఖో అథ్లెటిక్స్, 16న కబడ్డీ, 17న వాలీబాల్, కబడ్డీ, ఫైనల్స్ ఉంటాయని పేర్కొన్నారు. మండలస్థాయిలో విజేత జట్లకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపుతామని వివరించారు.

మల్దకల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ కృష్ణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్‌లతో పాటు అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 15 సంవత్సరాలు నుంచి 36 సంవత్సరాలలోపు క్రీడాకారులు అర్హులని వివరించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మల్దకల్: ఉపాధి హామీ పనులను జాబ్‌కార్డులు ఉన్న కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ స్వామి సూచించారు. గురువారం మండలంలోని ఎల్కూరు, కుర్తిరావులచెర్వు, అమరవాయి, తాటికుంట, సద్దలోనిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల వినూత్న నిరసన

గద్వాల రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె గురువారం కొనసాగింది. స్థానిక జిల్లా కేంద్రం ఐకేపీ కార్యాలయం వద్ద పోస్టుకార్డు ప్రదర్శించి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమోషన్, ఐడీ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, రాధమ్మ, లక్ష్మణ్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

గట్టు: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. మండల మహిళా సమాఖ్య ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా పోస్ట్‌కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వీఓఏలకు రూ.10 లక్షల ప్రమాదబీమా కల్పించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు సురేష్, వీరేష్‌గౌడ్, మహాదేవ్‌గౌడ్, నాగరాజు, భాస్కర్, తిరుమలేష్, ప్రకాష్, మునేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో పోస్టు కార్డు ప్రదర్శిస్తూ నిరసనను తెలుపుతున్న వీఓఏలు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

అయిజ: తమ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఉప్పల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, కుటుంబసభ్యులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ జయంతమ్మ, భర్త ఎంపీటీసీ ప్రహ్లాద్‌రెడ్డిలు తమ భూమిని అన్యాక్రాంతం చేశారని వివరించారు. సమస్య పరిష్కరించాలని బాధితులు కోరారు.

బీజేపీ విధానాలపై బీఆర్ఎస్ మౌనం వీడాలి



శాంతినగర్: ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, అలంపూర్ ప్రధాన కార్యదర్శి రవిచందర్‌లు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఎస్పీపై చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. మరోమారు పునరావృత్తమైనే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. బీజేపీకి తోక పార్టీలా బీఆర్ఎస్ వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, బీసన్నలు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనే కాంగ్రెస్ లక్ష్యం



మాట్లాడుతున్న నాగశిరోమణి

శాంతినగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు నాగశిరోమణి అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం బలిదానాలు చేసుకుంటున్న విద్యార్థులను చూసి చలించి పార్టీ తెలంగాణను ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీపై బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బంగారు తెలంగాణగా మారుస్తానని సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. అమరవీరుల కుటుంబాలను గుర్తించి రూ.25 వేలు ప్రతినెల పెన్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో వడ్డేపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత, సేవాదళ్ మహిళ జిల్లా అధ్యక్షురాలు సులోచనమ్మ, కౌన్సిలర్ దేవమ్మ, ప్రవళిక పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టాలి

ఎర్రవల్లిచౌరస్తా: దళితబంధు పథకంలో కమీషన్ల పేరుతో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను తక్షణమే ప్రభుత్వం బయటపెట్టాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంబీ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దళితబంధు పథకంలో కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యే చిట్టా తన దగ్గర ఉందని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే ప్రకటించారని వెంటనే వారి పేర్లు వెల్లడించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్‌లను తొలగిస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చి కులాలు, మతాలు, రిజర్వేషన్లపై చిచ్చురేపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఎస్పీపై అసత్య ఆరోపణలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, ఉపేందర్, రాముడు, లక్ష్మన్న, బీసన్న, సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంబీ కృష్ణ

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు


ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవర సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం పాలబండ లాగుడు పోటీలను నిర్వహించారు. మొత్తం 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. యువకుల కేరింతల నడుమ ఉత్సాహంగా పోటీలు కొనసాగాయి. వివిధ ప్రాంతాలను రైతులు తరలివచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా, కొండూరు గ్రామానికి చెందిన నల్లబోతుల లక్ష్మిగోపాల్ సంబంధించిన ఎద్దులు మొదటిస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా, మల్యాల గ్రామానికి ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ షేక్ మైమునిసా సంబంధించిన ఎద్దులు రెండో స్థానంలో, కర్నూల్ జిల్లా, పెద్ద నాల్లురు గ్రామానికి చెందిన సుంకన్న, సీతరాములు చెందిన ఎద్దులు మూడోస్థానంలో నిలిచారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు ముత్యాల్ రెడ్డి, కొండన్న, రాముకోటిరెడ్డి, చిన్న నాగేంద్రం, వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు, మహదేవయ్య, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



అలంపూర్: మున్సిపాలిటీకి చెందిన దాసరి నరసింహులు నెల రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి భార్య దాసరి లక్ష్మిదేవి తోపాటు నలుగురు సంతానం ఉన్నారు. దీంతో ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న వివేకానంద యూత్ సొసైటీలు సభ్యులు గురువారం దాతల సహకారంతో బాధిత కుటుంబానికి రూ. 25 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సంజీవ నాయుడు, సభ్యులు శ్రీనివాసులు, సర్వేశ్వర్, ముస్తఫ, సురేష్, సూరి, వేణు, కరుణేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉర్సు



ధరూరు: మండల కేంద్రంలోని దర్వేష్‌అలీ ఉర్సు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గంధం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం జిల్లాతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ నజీమున్నీసాబేగం, సర్పంచ్ పద్మమ్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ బీఆర్ శివలీల, బీఆర్ విజయ్‌కుమార్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కార్యకర్తలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సు, బల్గెర, వాయిల్‌కుంటతండాలో గురువారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో మూడు గ్రామాల్లో మొత్తం 404 మందికి కంటి పరీక్షలు, 23 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 29 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, నర్మద, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు రేష్మ, భారతి, రావేల ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యాకుబ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని కొర్విపాడులో 4వ రోజు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. మొత్తం 161 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 12 మందికి అద్దాలను పంపిణీ చేశారు. 22 మందికి కంటి అద్దాల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, రాణి, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.



తప్పెట్లమొర్సులో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి

విద్యార్థినికి అండగా ఉంటా

అయిజ: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అండగా ఉంటానని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బింగుదొడ్డిలోని శ్రీనివాసులు, మారెమ్మ దంపతుల కూతురు అనిత ఇంటర్ ఫలితాల్లో 984 మార్కులు సాధించి జోగుళాంబ గద్వాల జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో గ్రామానికి చేరుకొని విద్యార్థిని అనితను సన్మానించారు. తల్లిదండ్రులు కూలీ పనిచేసుకొని కూతురుని చదివించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో విద్యార్థి చదువుకు ఆటంకం కలగకుండా ఆర్థికసాయం చేస్తానని సంపత్ కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి శేక్షవలి ఆచారి, కౌన్సిలర్ గిత్తల దేవరాజు, బసవరాజు, మధు, ఉలిగన్న, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన విద్యార్థిని గీతా మాధురి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచడంతో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అభినందించారు. గట్టు గురుకుల పాఠశాలలో విద్యార్థిని చదివి 9.7 మార్కులు సాధించింది. గురువారం పచ్చర్ల గ్రామంలో విద్యార్థి గీతామాధురితో పాటు తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి గీతా మాధురిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులు

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

గద్వాల రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతికూర్ రహ్మాన్ అన్నారు. గురువారం మండలంలోని అనంతపురంలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను 48 గంటల్లో చెల్లించాలన్నారు. అదేవిధంగా తరుగు తీయకుండానే ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యూనస్, అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అతికూర్ రహ్మాన్

ఇద్దరికి తీవ్ర గాయాలు

గద్వాల క్రైం: ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన పట్టణ శివారులో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు రెండో రైల్వే గేట్ కాలనీకి చెందిన రఘువర్ధన్, కిష్టన్నలు శుభకార్యానికి ఆహ్వానించేందుకు సమీపంలోని బంధువులు వెంకటేష్, గోకారిల ఇంటికి వెళ్లారు. ఇరువురి మధ్య అకారణంగా మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. రఘువర్ధన్, కిష్టన్నలపై సదరు వ్యక్తుల దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తకోట: క్రీడల్లో గెలుపోటములు సహజమని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో 15 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీలో విన్నర్‌గా నిలిచిన మక్తల్ టీంకు ఎమ్మెల్యే సొంతంగా రూ.లక్షతో పాటు మెమెంటో అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన కొత్తకోట టీంకు కొత్తకోట సింగిల్ విండో చైర్మన్ కొట్టం వంశీధర్‌రెడ్డి సొంతంగా రూ. 50 వేలు, మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య వాకింగ్ టీం సభ్యులు ఎంతో శ్రమించి క్రికెట్ పోటీలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు వారిని ఆయన అభినందించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల 70 టీంలు పాల్గొన్నప్పటికి, వారందరికీ ఇబ్బందులకు కలగకుండా పోటీలను పూర్తి చేసినట్లు చెప్పారు. యువత ప్రతి ఒక్కరూ ఇలాంటి వాకింగ్ టీం సభ్యులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల వల్ల యువతకు ఆరోగ్యంతో పాటు, సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, ఆరోగ్య క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకుడు శేఖర్‌గౌడ్, కొత్తకోట సింగిల్ విండో చైర్మన్ వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, నాయకులు సంధ్య రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, జగన్, అంజనేయులు, రాములు యాదవ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



విన్నర్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి